క్లుప్తంగా

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ఉయ్యూరు: సాంకేతికతను అందిపుచ్చుకుని లక్ష్యాలను అధిగమించాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎం.సుమన్ కోరారు. మండలంలోని కలవపాముల జ్యోతి పాలిటెక్నిక్‌లో రూ.20 లక్షల వ్యయ అంచనాతో నిర్మించిన అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో కంప్యూటర్‌పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్.వి.రమణ, ప్రిన్సిపల్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ప్రయోగశాలలతో విద్యార్థులకు నైపుణ్యం



పెనమలూరు: ప్రయోగశాలలతో విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని అప్లయ్‌వోల్టు ఎండీ కాకర్ల రమేష్ నాయుడు అన్నారు. కానూరు సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం స్టీమ్ ల్యాబ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజన, ఊహాశక్తిని పెంపొందిస్తుందన్నారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, చిత్రకళ, గణిత శాస్త్ర ప్రయోగశాలను స్టీమ్ ల్యాబ్‌గా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన 160 మోడల్స్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో అమరావతి బోటింగ్ ఎండీ కాకాని తరుణ్, ప్రిన్సిపాల్ మనోజ్‌కర్మాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు



పెనమలూరు: వారం రోజులుగా వివిధ అంశాల్లో ఉత్తమ సేవలు అందించిన పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ క్యాంపు శుక్రవారం ముగిసింది. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మున్సిపాలటీ పరిధిలో మెగా దంత వైద్య శిబిరం, మట్టి సంరక్షణ, క్యాన్సర్, ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన, నిరుద్యోగ యువతపై ఇంటింటి సర్వే పలు కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు వంద మంది వలంటీర్లు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శ్యామ్ వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

కంటిని నిర్లక్ష్యం చేయొద్దు



కంకిపాడు: కంటిని నిర్లక్ష్యం చేస్తే దృష్టిని కోల్పోవాల్సి వస్తుందని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ అన్నారు. కంకిపాడులో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్ త్రీ కార్యక్రమం నిర్వహించారు. 96 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. పరీక్షలు చేయించుకున్న వృద్ధులకు కళ్లజోళ్లు అందజేశారు. దృష్టి లోపాలను ప్రాథమిక దశలో గుర్తించి, ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న శిబిరాలను వినియోగించుకుని వైద్య సాయం పొందాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పి.సుజాత, యు.శిరీష, ఎస్.దుర్గాభవాని, వి.దుర్గ, వి.పార్వతి, టి.మంజుఫిల్మేనా పాల్గొన్నారు.

పరీక్ష అట్టలు అందజేత



గన్నవరం రూరల్: పూర్వ విద్యార్థులు పాఠశాలకు తరగని సంపదని గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్ హెచ్ఎం జగదీశ్వరరావు అన్నారు. పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం 1978–79 విద్యా సంవత్సరంలో టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సంఘం నాయకులు తమ్మిశెట్టి మురళీకృష్ణ, శ్రీనివాసరావు, చిట్టినేని పూర్ణచంద్రరావు పరీక్ష అట్టలు వితరణగా అందజేశారు. హెచ్ఎం వారిని అభినందిస్తూ ప్రతి విద్యార్థి పాఠశాలకు పూర్వ విద్యార్థిగా మారాల్సిందేనని, చదువుకున్న పాఠశాల, గురువులు, తల్లిదండ్రులను గౌరవిస్తూ, వారికి సహకరిస్తూ నడిచిన వారు చరిత్రలో గొప్ప వారుగా నిలుస్తారన్నారు. రమేష్‌బాబు, పీడీ శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ఉయ్యూరు: పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కాటూరు రోడ్డులో సినిమా థియేటర్ వెనుక ఉన్న ఇంట్లో పేకాడుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వీరప్రసాద్ సిబ్బందితో దాడి చేశారు. దాడిలో ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ 56 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహిళలు పోషకాహారం తీసుకోవాలి



గోసాలలో పోషణ్ పక్వాడాలో అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనమలూరు: మహిళలు పోషకాహారం తీసుకోవాలని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి కె.బేబీ సుకన్య అన్నారు. గోసాల ఇస్లాంపేట లో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యాన పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లులు, గర్భిణు లు, బాలింతలు, కిశోర బాలికలు చిరుధాన్యాలు, ఆకుకూరలను తింటే రక్తహీనత ఉండదన్నారు. పౌష్టికాహారం తయారు చేసుకునే విధానాన్ని చూపించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి.రమానాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంకిపాడు: పౌష్టికాహారంపై అవగాహన పెంపొందించాలని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ బేబీ సుకన్య సూచించారు. ఈడుపుగల్లు సెక్టార్ పరిధిలో శుక్రవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. చిరు ధాన్యాలతో తయారుచేసిన వివిధ రకాల పిండి వంటలను ప్రదర్శించారు. ప్రదర్శనను సీడీపీఓ బేబీ సుకన్య తిలకించారు. ఆమె మాట్లాడుతూ చిరు ధాన్యాలను భుజిస్తే శరీరానికి లభించే పోషకాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు తయారుచేసుకోవడంపై సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లల తల్లులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ గన్నవరం సీడీపీవో పి.వెంకటలక్ష్మి అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ్ పక్వాడా'లో భాగంగా పౌష్టికాహార పక్షోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. సీడీపీఓ వెంకటలక్ష్మి మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత కలుగుతుందని చెప్పారు. పిల్లల పెరుగుదల లోపం, వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు లేకపోవడంతో సమస్యలు కలుగుతాయని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచ్ అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.దుర్గాదేవి, అంగన్‌వాడీ వర్కర్లు లలిత కుమారి, శివలీల, రమాదేవి, వీర నాగమణి, ఇందిరాకుమారి, హేమలత, సహేరా బేగం పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

పెనమలూరు: తాడిగడప జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపడంతో వారికి బహుమతులు, సర్టిఫికెట్లు శుక్రవారం అందజేశారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు ఏడు రోజులుగా పలు సేవా కార్యక్రమాలను తాడిగడప మున్సిపాలటీ పరిధిలో నిర్వహించారు. ప్రధానంగా ఇంటింటికీ తిరిగి 19 నుంచి 25 ఏళ్ల వయస్సు ఉన్న వారు చదువుకుని ఉద్యోగం చేస్తున్నా చేయక పోయిన వారి వివరాలు సేకరించారు. ఆధార్‌కార్డులో మార్పులు చేర్పులపై అవగాహన కల్పించారు. తృణధాన్యాలతో కలిగే మేలు, ప్లాస్టిక్ నివారణపై కూడా అవగాహన కల్పించారు. శుక్రవారం తాడిగడప జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన, స్పెల్‌బీ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కనకదుర్గ, కమిటీ సభ్యురాలు లావణ్య, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

రామవరప్పాడు: రూరల్ మండలం ప్రసాదంపాడు, ఎనికేపాడులోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు పనుల కోసం ప్రసాదంపాడులో ఆశ్రమం రోడ్డు, శాస్త్రి బజారు, ఆంధ్రా బ్యాంక్ సమీప ప్రాంతాల్లో, ఎనికేపాడులో కొడారివారి వీధి, డీమార్ట్ ఏరియా, జెండా చెట్టు సెంటర్‌లలో పైన తెలిపిన సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

పెద ఓగిరాల నుంచి యూబీఐని తరలించొద్దు



కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందిస్తున్న పెద ఓగిరాల గ్రామస్తులు

ఉయ్యూరు: పెద ఓగిరాల గ్రామం నుంచి యూనియన్ బ్యాంకును తరలించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషాను పెద ఓగిరాల గ్రామస్తులు కోరారు. శుక్రవారం మచిలీపట్నంలోని కలెక్టరేట్‌కు వెళ్లి గ్రామస్తులు వినతిపత్రం అందించారు. 12 ఏళ్ల క్రితం గ్రామంలో ఆంధ్రాబ్యాంకు ఏర్పాటు చేసిందన్నారు. బ్యాంకు యూనియన్ బ్యాంకుగా మారినప్పటి నుంచి ప్రజలకు మరింత సేవలు అందుతున్నాయన్నారు. దీన్ని తీయకూడదని పంచాయతీ గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం చేసిందని పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు తరలించే ప్రయత్నాలను కొనసాగిస్తున్నారన్నారు. యూనియన్ బ్యాంకు ఉన్నతాధికారులతో మాట్లాడి గ్రామస్తులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి, త్రిపురం చందు, గంజరపల్లి వెంకట సుబ్బారావు, భీమవరపు పరమేశ్వర్‌రెడ్డి, అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, కృష్ణారెడ్డి, బ్రహ్మారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

అత్తింటి వారిపై వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప శ్రీనివాసనగర్ కాల్వ కట్టకు చెందిన బారుక లక్ష్మి 2021లో ఒడిశాకు చెందిన సంతోష్‌కుమార్ ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే భర్త భార్యతో గొడవపడి తన ఊరికివెళ్లాడు. కాపురానికి రమ్మంటే కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాడు. ఆమె అత్త మాలతి కూడా కట్నం తీసుకొస్తేనే కాపురం ఉంటుందని బెదిరిస్తోంది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు భర్త, అత్తపై కేసు నమోదు చేశారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

గన్నవరం రూరల్: రైతుల సంక్షేమంకోసం విస్తృతంగా క్రాప్ లోన్‌లు అందజేస్తున్నట్లు ముస్తాబాద సహకార బ్యాంకు చైర్‌పర్సన్ మేడసాని శ్రీనివాస చౌదరి చెప్పారు. శుక్రవారం స్థానిక బ్యాంకులో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిక్సిడ్ డిపాజిట్లతో పాటు రైతు నేస్తం, దీర్ఘకాలిక, స్వల్ప కాలిక లోన్లు రైతులకు అందజేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం రైతులు క్రాప్ లోన్‌లు 100 శాతం చెల్లించడంతో అభినందనలు తెలిపారు. రైతులు కంచర్ల ఈశ్వరరావు, యాగంటి రవీంద్ర, పొలడుగు కోటేశ్వరరావు, అర్జా శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. బ్యాంకు సిబ్బంది రైతులకు వివరాలను అందించారు.

మహిళల ఆర్థికాభ్యున్నతికి 'స్వచ్ఛంద' కృషి



కుట్టుమిషన్లు అందజేస్తున్న సీఐ, సర్పంచి

గన్నవరం: మహిళల ఆర్థికాభ్యున్నతికి తోడ్పాటునందించడానికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని గన్నవరం సీఐ కనకరావు పేర్కొన్నారు. మండలంలోని దావాజీగూడెం ఎంపీపీ పాఠశాల ఆవరణలో శుక్రవారం వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఎనిమిది మంది మహిళలకు కుట్టు మిషన్లు, ముగ్గురికి తోపుడు బండ్లు పంపిణీ చేశారు. మరో ఐదుగురు మహిళలకు చిరు వ్యాపారాలు చేసుకునేందుకు రూ. 20 నుంచి రూ. 25 వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. సీఐ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత మహిళల అభ్యున్నతికి వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అల్లాపురం సర్పంచి డొక్కు వెంకన్నబాబు, మహిళా మండలి కార్యదర్శి రష్మి, మహిళా మిత్ర సభ్యులు రామారావు, సుబ్బారావు, పాఠశాల హెచ్ఎం నవభారతి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము మంజూరు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పెన్షనర్లకు పింఛన్ సొమ్మును ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీడీఓ సునీతాశర్మ అన్నారు. ఆమె శుక్ర వారం వివరాలు తెలుపుతూ మొత్తం 17,908 మంది లబ్ధిదారులకు రూ 4,98,25,250 కోట్ల పింఛన్ సొ మ్ము మంజూరు చేసిందన్నారు. ఇందులో పెనమలూ రు మండలానికి 5552 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ 1,53,46,000, తాడిగడప మున్సిపాలటీలో 12, 356 మందికి రూ 3,44,79,250 సొమ్ము మంజూరు చేసిందన్నారు. పింఛన్ ఏప్రిల్ 1వ తేదీ లేదా 3వ తేదీన పంపిణీ చేస్తామని చెప్పారు. వలంటీర్లు ఇళ్లకు వచ్చి పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తారని తెలిపారు.

జగనన్నకు అండగా ఉందాం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి

గన్నవరం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉందామని జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజిబెత్ రాణి చెప్పారు. మండలంలోని పురుషోత్తపట్నంలో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం జరిగింది. ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రాన్ని దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నిలిపారన్నారు. గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. సంక్షేమాన్ని గడప గడపకు తీసుకువచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామ కన్వీనర్ బండి ప్రభుదాసు, స్థానిక నాయకులు చెరుకూరి రామ్మోహనరావు, కొడాలి వెంకటేశ్వరరావు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, మండల అధ్యక్షుడు పడమట సురేష్, నాయకులు ఆర్వీఆర్, నాగనబోయిన గిరీష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలు

గన్నవరం రూరల్: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని మండల వైద్యాధికారి డాక్టర్ జె.సంధ్య చెప్పారు. ముస్తాబాద పీహెచ్‌సీలో ప్రతి శుక్రవారం ఆర్థోపెడిక్ సేవలు రోగులకు అందిస్తున్నట్లు వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో నిపుణులైన వైద్యులు సేవలందిస్తున్నారన్నారు. శుక్రవారం ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సురేష్ ఎముకల వ్యాధిగ్రస్తులను పరీక్షించి చికిత్స చేశారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

కోర్టు వాయిదాకు గైర్హాజరు.. అరెస్టు వారెంటు జారీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: వాయిదాకు హాజరు కాని ఇద్దరిపై న్యాయస్థానం అరెస్టు వారెంటు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ గన్నవరం నియోజకవర్గ మాజీ సమన్వయకర్తలు డాక్టర్ దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకట్రావులపై నూజివీడు న్యాయస్థానం శుక్రవారం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. వివరాల్లోకి వెళ్లితే.. 2018 జూన్ 27న వైఎస్సార్ సీపీ కార్యకర్తల అక్రమ అరెస్టుకు నిరసనగా హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆ పార్టీ నేతలు యార్లగడ్డ వెంకట్రావు, దుట్టా రామచంద్రరావు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఘటనపై నమోదైన కేసులో శుక్రవారం నూజివీడు కోర్టులో వాయిదాకు గైర్హాజరు కావటంతో దుట్టా, యార్లగడ్డతో పాటుగా ఆరుగురికి 2వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సాయిరాం అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. వీరిని అరెస్ట్ చేసి సోమవారం న్యాయస్థానంలో హాజరుపర్చాలని ఆదేశించారు.

ముగిసిన వసంత నవరాత్రులు



గన్నవరం: స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న వసంత నవరాత్రి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్య స్వామికి వివిధ రకాల పుష్పాలతో అర్చన చేశారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో భక్తులు శ్రీలలిత సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ పలువురు పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యకు దరఖాస్తులు చేసుకోవాలి

గన్నవరం రూరల్: మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ ప్రోగ్రాంకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని మండలంలోని సచివాలయాల మహిళా పోలీసులు శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. దీని ద్వారా ఆర్థిక సాయం అందుతుందని వారు తెలిపారు.

అనాథలు, అభాగ్యులు, పాక్షిక అనాథలు అర్హులని, వీరిని మ హిళా కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గుర్తిస్తారని పేర్కొన్నారు. వీరికి జనన సర్టిఫికెట్, ఆధార్, తల్లిదండ్రుల ఆధార్ లేదా గార్డియన్ ఆధార్, రైస్ కార్డు, క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు, ఫొటో, స్టడీ, బ్యాంకు అకౌంట్ తదితర సర్టిఫికెట్లు ఉండాలన్నారు. బాల కార్మికులు, ప్రకృతి వైపరీత్య బాధితులు, హెచ్ఐవీ బాధిత బాలలు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

నేడు 'ఉపాధి'పై ప్రజావేదిక

కంకిపాడు: ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక ఏప్రిల్ 1న స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు తెలుపుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో 2021–22కు చేపట్టిన ఉపాధి పనులపై మార్చి 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ సామాజిక తనిఖీ నిర్వహించారన్నారు. దీనిపై ప్రజావేదిక ఏప్రిల్ 1 ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు



కళావేదికను ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థులు

ఉంగుటూరు: పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు రూ.11లక్షలు తోడ్పాటునందించడం అభినందనీయమని హెచ్ఎం పద్మవాణి అన్నారు. మానికొండ జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆర్థిక తోడ్పాటు రూ.11 లక్షలతో నిర్మించిన కళావేదిక, సైకిల్‌స్టాండ్, సీసీ కెమెరాలను వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గోగినేని వెంకటేశ్వరరావు(బాబు) పూర్వ విద్యార్థులతో ప్రారంభించారు. పూర్వ విద్యార్థి ఎన్ఆర్ఐ వి.బాలవీరరాఘవయ్య అందజేసిన రూ.6 లక్షలతో కళావేదిక, పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో సైకిల్ స్టాండ్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మన్నే ఉమామహేశ్వరరావు, కార్యదర్శి కడియాల ముక్తేశ్వరరావు, ట్రెజరర్ వెంకటరత్నం, మాజీ సర్పంచ్ నెర్సు చింతయ్య, రామ్‌మోహన్ రావు, ఆజాద్ పాల్గొన్నారు.

చర్చి అభివృద్ధికి ఎమ్మెల్యే రూ. లక్ష విరాళం



విరాళం నగదు అందజేస్తున్న పార్టీ నేతలు

గన్నవరం: బాపులపాడు మండలంలోని బొమ్ములూరు ఆర్‌సీఎం చర్చి అభివృద్ధికి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ. లక్ష విరాళం ఇచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో బాపులపాడు పీఏసీఎస్ అధ్యక్షులు యర్రంశెట్టి రామాంజనేయులు.. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. యర్రంశెట్టి మాట్లాడుతూ...ఆర్‌సీఎం చర్చి అభివృద్ధి విషయమై ఇటీవల నిర్వహణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సహకారం కోరినట్లు చెప్పారు. వెంటనే స్పందించిన ఆయన సొంత నిధుల నుంచి విరాళం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గండేపూడి రాణి, వైఎస్సార్ సీపీ గ్రామ నేతలు ముసునూరి కృష్ణారావు, వీరయ్య, కుందేటి రాంబాబు పచ్చిగళ్ల యోహాను తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరులో 'పది' పరీక్ష కేంద్రాలు

పెనమలూరు: మండల పరిధిలో జరగనున్న టెన్త్ ఎగ్జామ్స్‌కు పది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 2,398మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. మండలంలోని ఆరు జెడ్పీ పాఠశాలల నుంచి 591 మంది విద్యార్థులతోపాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 1807మంది పరీక్షకు హాజరుకానున్నారు. ప్రశ్నపత్రాలు ఇప్పటికే పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. పరీక్షా కేంద్రాలు గోసాల హెచ్ఎంకె, పెనమలూరు జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు, పోరంకి జిల్లా పరిషత్ పాఠశాల, కానూరు నారాయణ పాఠశాల, కానూరు జిల్లా పరిషత్ పాఠశాల, యనమలకుదురు జిల్లా పరిషత్ పాఠశాల, కానూరు సెయింట్ థెరిస్సా, పెనమలూరు చైతన్య, పోరంకి నారాయణ పాఠశాలల్లో అధికారులు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష ఉదయం 9.30 నిమిషాలకు ప్రారంభమవుతుంది. ఆలస్యంగా వస్తే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు.

హనుమజ్జయంతి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం



జంక్షన్‌లో రాటాను ప్రతిష్టిస్తున్న ఆలయ పాలకమండలి సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఏటా వైభవంగా నిర్వహించే హనుమజ్జయంతి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాల ఏర్పాట్లను దేవస్థానం ప్రాంగణంలో రాటా ఉత్సవంతో శుక్రవారం ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు శృంగారం రామానుజాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవ పందిరి ఏర్పాటుకు రాటా కర్రను ప్రతిష్ఠించారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పుక కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఆదిలక్ష్మి దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించి ఏర్పాట్లు ప్రారంభించారు. ఉత్సవాలను మే 9 నుంచి 14వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. సుంకర సుభాష్‌చంద్రబోస్, మేడేపూడి రామ్మోహనరావు, మందలపు సులోచన, బోయపాటి పూర్ణచంద్రరావు, నారికమిల్లి కనకదుర్గాప్రసాద్, తాడి రంగారావు, సగ్గుర్తి శ్రీనివాసరావు, వడ్డి చిన్నయ్య పాల్గొన్నారు.

వ్యాధి పీడితురాలికి రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న బాపులపాడునకు చెందిన బుద్ధుల మైనాకు సీఎం సహాయనిధి ద్వారా రూ. 2 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేసినట్లు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాపులపాడునకు చెందిన బుద్ధుల రామస్వామి కుమార్తె మైనా ఇటీవల ప్రసవానంతరం అనారోగ్యానికి గురైంది. ఆమె విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు పిత్తాశయంలో రాళ్లు ఉన్నాయని, ఒక రాయి పేగులోకి జారిపోవటంతో ఇన్‌ఫెక్షన్ సోకిందని వైద్యులు తెలిపారు. తక్షణమే శస్త్రచికిత్స చేయాలని రూ. 2.19 లక్షలు ఖర్చు అవుతుందని ఆస్పత్రి వర్గాలు తెలపడంతో రామస్వామికి దిక్కుతోచలేదు. దీంతో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీని ఆశ్రయించి పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వంశీ ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేయించారు. దీంతో ఆమెకు ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. తన వైద్యానికి సాయం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

డ్వాక్రా మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ



మహిళలకు పెరటికోళ్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రామీణ ప్రాంత మహిళల స్వయం ఉపాధి కల్పన, ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. మహాత్మా గాంధీనగర్‌లోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ క్రాంతి పథం కింద పెరటికోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 78 మంది మహిళలకు నక్కా గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్ పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి 8 కోడిపెట్టలు, మూడు కోడి పుంజులు, మూడు నెలలకు సరిపడా మందులు, 20 కేజీల దాణా అందజేశారు. ఏపీఎం భూపతిరావు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

గన్నవరం: రెండు చోరీ కేసుల్లో నిందితుడికి గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు మూడు నెలల చొప్పున జైలుశిక్ష విధించింది. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లోని ఆదిరెడ్డి మాలకొండారెడ్డికి చెందిన బడ్డీకొట్టులో ఈ ఏడాది జనవరి 13వ తేది అర్ధరాత్రి చోరీ జరిగింది. అదే నెల 18వ తేదీ రాత్రి సూరంపల్లి అడ్డరోడ్డు వద్ద పెట్రోల్ బంక్‌లో పార్కింగ్ చేసిన ట్రాక్టర్ అపహరణకు గురైంది. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసిన గన్నవరం పోలీసులు నిందితుడు ఆగిరిపల్లి మండలం రాజవారి గొల్లగూడెంకు చెందిన దేరంగుల రాంబాబును అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ స్థానిక 12వ ఏఎంఎం కోర్టులో కొనసాగుతోంది. శుక్రవారం నేరం రుజువు కావడంతో ఒక్కొక్క నేరానికి మూడు నెలల చొప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి శిరీష తీర్పు ఇచ్చారు.